## కాకా సేవలు మరువలేనివి

**వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**




ప్రసంగిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

సిటీబ్యూరో/చిక్కడపల్లి, డిసెంబర్ 22: దేశ నిర్మాణానికి ఎంతో మంది విద్యార్థులను వెంకటస్వామి(కాకా) స్థాపించిన అంబేద్కర్ విద్యాసంస్థ అందించడం అభినందనీయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో మాజీ కేంద్ర మంత్రి జి.వెంకట్ స్వామి 9వ వర్ధంతి, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరై వెంకట్ స్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ జి.వివేక్ వెంకట్ స్వామి, కార్యదర్శి, ఎమ్మెల్యే వినోద్, కరస్పాండెంట్ సరోజా, రమ, ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, కేఎల్.నాగరాజు, ప్రొఫెసర్ లింబాద్రి, పురుషోత్తం, రిటైడ్ జస్టిస్ చంద్రకుమార్, విమలక్క, పాల్గొన్నారు.

*మహమ్మారి మళ్లీ వచ్చింది..*

## అప్రమత్తంగా ఉండాలి

- కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి రఘునాథస్వామి



మేడ్చల్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కొత్త వేరియంట్‌తో అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రఘునాథ స్వామి సూచించారు. ఇప్పటికే వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. కరోనా లక్షణలు ఏవైనా ఉంటే వెంటనే సమీప ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానల్లో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. మహమ్మారి కట్టడికి ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రిలో 50 పడకలు, ఘట్‌కేసర్ సీహెచ్‌సీలో 10 పడకలు, మేడ్చల్ పీహెచ్‌సీ ఆవరణలో 10 పడకలలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసామన్నారు. 37 అంబులెన్స్‌లు, 17 టెలిమెడిసిన్ సౌకర్యాలు కల్పించమని, అంబులెన్స్ కాల్ సెంటర్లు 282 ఉన్నట్లు వెల్లడించారు.

## టీఎస్ ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేయాలి

**ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్**



నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 22 : ప్రజారవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసి టీఎస్‌ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, స్టాఫ్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో స్టాఫ్, వర్కర్స్ యూనియన్ నూతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్లను పునరుద్ధరించడంతో పాటు ఆర్టీసీ విలీన కమిటీ తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులకు ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2019లో సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికులపై పోలీసులు పెట్టిన కేసులను ఎత్తివేసి, బకాయి ఉన్న డీఏ ఇవ్వాలన్నారు. 2017, 2021 వేతన సవరణలు చేసి, సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అడిషనల్ ప్రధాన కార్యదర్శులు డి.గోపాల్, అబ్దుల్ హఫీజ్‌ఖాన్, జి.అబ్రహం, ఉపప్రధాన కార్యదర్శి ఎస్.సాయిరెడ్డి, చీఫ్ ఉపాధ్యక్షుడు వై.డి.బెన్ సుశీల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశం, నాయకులు జి.స్వామి పాల్గొన్నారు.

# ఆ చేప ధర లక్షా 45వేలు



- హైటెక్స్‌లో 'పెటెక్స్ ఇండియా, కిడ్స్ ఫెయిర్ - 2023' షురూ
- పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి
- టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- నగర నలుమూలల నుంచి తరలివచ్చిన సందర్శకులు
- నేడు 1200 మంది పిల్లలతో కిడ్స్ రన్



ఎక్స్ పోలో పావురాలను ఎగురవేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మాదాపూర్, డిసెంబర్ 22 : తెలంగాణ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించే అంశాలలో టూరిజం ప్రమోషన్ ఒకటని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పెటెక్స్ ఇండియా, కిడ్స్ ఫెయిర్ – 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై హైటెక్స్ హెడ్ టీజీ శ్రీకాంత్‌తో పాటు నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు గొప్ప సంస్కృతి వారసత్వం ఉన్నదని అన్నారు. తెలంగాణలో పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో నివాసముంటున్న ప్రతి ఒక్కరూ తెలంగాణ టూరిజంకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటూ ప్రోత్సహించాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ అత్యుత్తమ రాష్ట్రంగా నిలిచిందన్నారు. అనంతరం హైటెక్స్ హెడ్ టీజీ శ్రీకాంత్ మాట్లాడుతూ కిడ్స్ ఫెయిర్ నాలుగు కీలక విభాగాలైన విద్య, జీవనశైలి, పోశకాహారం, అభిరుచులు వంటి వాటిలో ఒక శక్తివంతమైన ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తుందన్నారు. పెటెక్స్ అనేది కేవలం ప్రదర్శన మాత్రమే కాదని పెంపుడు జంతువుల సంక్షేమం కొరకు లోతుగా శ్రద్ధ వహించే ఎక్స్ పో అని తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఎక్స్‌పోకు కుటుంబ సమేతంగా విచ్చేసి ఆయా స్టాల్స్‌ను సందర్శించారు.

### ప్రదర్శనలో కొలువుదీరిన అలంకార చేపలు

హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన పెటెక్స్ ఎక్స్ పోలో భాగంగా పలు రకాల అలంకార చేపలు దర్శనమిచ్చాయి. ఇందులో సిల్వర్ అరోవానా, ఫ్లవర్ హార్న్, కోయి ఫిష్, జెయింట్ గౌరామి, ఎలిగేటర్ గార్, టైగర్ ఆస్కార్, అల్బినో ఆస్కార్, రెడ్ పారెట్ ఫిష్, ఫవర్ ఫిష్, కిస్సింగ్ గౌరామి, 4 రకాల సిచ్లిడ్స్, స్కాట్స్ ఫిష్ వంటి 50 రకాలకు పైగా అలంకార చేపలతో పాటు పలు జాతులకు చెందిన శునకాలు ఈ ప్రదర్శనలో కొలువుదీరగా టైగర్ షార్క్, ట్విన్ ఫిన్ బార్బ్, రెడ్ క్యాప్ గోల్డ్ ఫిష్, ఒరాండా గోల్డ్ ఫిష్, పాకు ఫిష్, రోజీ బార్బ్, టైగర్ బార్బ్, సకర్ క్యాట్ ఫిష్, 5 రకాలకు చెందిన టెట్రాస్, చన్నా ఫిష్, ఎండ్రకాయలు, ఎస్కే గోల్డ్, మోలీస్ 3 రకాలు, సిల్వర్ డాలర్స్, స్టింగ్రే ఫిష్, స్టార్ ఫిష్ రెడ్, బ్లాక్ గోస్ట్ ఫిష్, ఆరోవానో ఫిషలు ఉన్నాయి. వీటి ధర ఒక్కోటి రూ.లక్షా 45వేలు ఉంటుందని, ఇందులో అరోవానా చేపలు చాలా అరుదుగా కనిపిస్తుంటాయని నిర్వాహకులు తెలిపారు. వీటిని చూసేందుకు నగర నలు మూలల నుంచి పలువురు విచ్చేసి ప్రదర్శనలో ఏర్పాటు చేసిన జంతువుల వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

### ఎక్స్ పోలో నేటి ప్రదర్శనలు

బెంగళూరుకు చెందిన సుభద్ర చెరుకూరిచే శనివారం ఉదయం 11 గంటలకు థెరపీ డాగ్స్ వర్క్ షాపుతో పాటు డెమోను నిర్వహించనున్నారు. ఇందులో పెంపుడు జంతువులు, మనోరోగ వైద్యులు, మనస్తత్వ శాస్త్ర విద్యార్థులు, డాగ్ ట్రైనర్స్, ఆందోళన మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించే మానసిక ఆరోగ్య సంబంధిత సంస్థలపై చర్చలు జరగడంతో పాటు షెల్టర్ కుక్క పిల్లలతో యోగా, విన్యాసాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు 1200 మంది పిల్లలతో కిడ్స్ రన్ కొనసాగుతుందని ఇందులో పిల్లల తలిదండ్రులు సైతం పాల్గొనవచ్చునితెలిపారు. ఖగోళ త్రీడీ థియేటర్, డైనోసార్ మూవీ ఎక్స్‌ట్రా వాగాంజా, మిరుమిట్లు గొలిపే వర్క్ షాపులను అందుబాటులో ఉంచనున్నారు.

## పూర్వ విద్యార్థులు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

**జేఎన్‌టీయూహెచ్ గ్లోబల్ అల్యూమిని మీట్-2023లో గవర్నర్ తమిళిసై**



సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : యూనివర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్ గ్లోబల్ అల్యూమిని మీట్–2023 కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి, రాష్ట్ర మాజీ డీజీపీతో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ ఆంధ్రావంశీ, ఆడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్ డాక్టర్ జితేందర్, యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్‌హుస్సేన్, గ్లోబల్ అల్యూమిని మీట్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్‌కుమార్, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, డైరెక్టర్లు, హెచ్‌వోడీ తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

- విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి.. పాకెట్ మనీ ఇవ్వాలి
- ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్




కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 22 : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నూతన ప్రభుత్వంపై ఉన్నదని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఏం కోరుకుంటున్నాయి'అనే అంశంపై మేథోమథనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోదండరాం హాజరై ప్రసంగించారు. గతంలో ప్రభుత్వాలు వివిధ కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా వర్సిటీల స్థితిగతులపై నివేదిక కోరేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం వర్సిటీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెస్ ఫీజులతో పాటు అదనంగా పాకెట్ మనీ కూడా అందించాలని కోరారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు మేథో సంపత్తిని పెంపొందించుకోవాలని సూచించారు. వర్సిటీలు హేతుబద్ధమైన పోరాటాలకు కేంద్రంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు శాతం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఓయూకు రూ.వెయ్యి కోట్లతో పాటు ఇతర వర్సిటీలకు రూ. 300 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ చింత గణేశ్, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య నెల్లి, నాయకులు లెనిన్, ఉదయ్, సాయిభగత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మూసారాంబాగ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, డిసెంబర్ 22(నమస్తే తెలంగాణ): అంబర్‌పేట్, మూసారాంబాగ్‌ను కలిపే మూసీపై వంతెన నిర్మాణ పనుల నేపథ్యంలో శనివారం నుంచి ఈ రూట్‌లో రాకపోకలు నిలిపివేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబర్‌పేట్ నుంచి టీవీ టవర్ వైపు వెళ్లే వాహనాలను అలీ కేఫ్ ఎక్స్ రోడ్డు నుంచి జిందాతిలిస్మాత్ మీదుగా గోల్నాక కొత్త బ్రిడ్జిపై నుంచి హైటెక్ ఫంక్షన్ హాల్, అఫ్జల్‌నగర్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుంచి పిస్తా హౌస్ మూసారాంబాగ్ జంక్షన్‌కు చేరుకోవాలని సూచించారు.

## పదహారు రైళ్లు రద్దు..

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) :దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో పదహారు రైళ్లను రద్దు చేస్తూ శుక్రవారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సికింద్రాబాద్–గుంటూరు, సికింద్రాబాద్–కర్నూల్ సిటీ, హైదరాబాద్–కర్నూల్, రాయచూర్–కాచిగూడ, కాచిగూడ–మహబూబ్‌నగర్, కాచిగూడ–గుంతకల్, గుంతకల్–బోధన్ వంటి పలు రైల్వే స్టేషన్ల మధ్యలో ఈ నెల 22, 23 తేదీలలో 16 రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే ఆరు రైళ్లను దారిమళ్లించామన్నారు.

*77 మంది సిబ్బందికి సేవా పురస్కారాలు*

దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న 77 మంది రైల్వే సిబ్బందికి విశిష్ట రైల్ సేవా పురస్కార అవార్డులను ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రదానం చేశారు.